క్లుప్తంగా

కాలువలు నిర్మించాలి

సీతానగరం: మండల కేంద్రంలోని రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు కారణంగా వరద నీరంతా రోడ్డుపై పారడం, కాలువలు లేక పోవడంతో నీరు నిల్వ ఉండి పాదచారులు సైతం రాక పోకలకు ఇబ్బందులు పడుతున్నారు. నిరంతరం ప్రజలు కాలినడకన, ద్విచక్ర వాహనాలతో, ఆటోలు, బస్సులు లారీలు తిరుగాడే మార్కెట్ బీటీ రోడ్డుకు కాలువలు లేక పోవడంతో నీరు నిల్వ ఉండి పోవడం వలన బీటీ రోడ్డు పాడైపోతోంది. ప్రభుత్వం స్పందించి రోడ్డు అభివృద్ధి పనులు చేపట్టి కాలువలు నిర్మాణానికి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

కలెక్టర్‌ను కలిసిన బాలల హక్కుల కమిషన్ చైర్మన్



కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌కు పుష్పగుచ్ఛమిచ్చి అభినందిస్తున్న చైర్మన్ అప్పారావు

పార్వతీపురం: కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్‌ను రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేశలి అప్పారావు, సభ్యుడు సీతారాం శుక్రవారం ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛమిచ్చి కలెక్టర్‌ను అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డ్రగ్స్ నియంత్రణకు అధికారులతో సమన్వయంతో పని చేసి డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని సూచించారు.

లక్ష్మీపురంలో వైద్య శిబిరం



రోగులను తనిఖీ చేస్తున్న డాక్టర్ హేమాక్షి

సీతానగరం: మండలంలోని లక్ష్మీపురంలో ప్రభుత్వ ఆయుష్ వైద్యురాలు టి.హేమాక్షి ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 80 మందికి వైద్య సేవలు అందించారు. అవసరమైన వారికి ఆయుర్వేద మందులు అందజేశారు. వీటిని నియమబద్ధంగా వాడడం ద్వారా వ్యాధులు దూరమవుతాయన్నారు. వర్షాలు కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఏఎన్‌ఎం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.


ముమ్మరంగా ఉభాలు



కూర్మరాజుపేటలో దమ్ము పడుతున్న ట్రాక్టర్

సాలూరు రూరల్: మండలంలో నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ముమ్మరంగా ఉభాలు జరుగుతున్నాయి. రైతులు సాగు పనుల్లో పూర్తిగా నిమగ్నమయ్యారు. ఓ వైపు ఉభాలు చేస్తూనే మరోవైపు వరి నాట్లు వేస్తున్నారు.

ఉత్తమ బోధనతో సత్ఫలితాలు సాధించాలి : ఆర్‌జేడీ



శిక్షణను పరిశీలిస్తున్న ఆర్‌జేడీ విజయ్‌కుమార్

సాలూరు: ఉపాధ్యాయులు బోధనా సామర్థ్యాలను పెంపొందించుకుని, విద్యార్థులకు బోధించడం ద్వారా మరింత ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని ఆర్‌జేడీ విజయ్‌కుమార్ అన్నారు. పట్టణంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బోర్డ్ డైరెక్టర్, ఎంఈఓ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో జరుగుతున్న టీచర్స్ టీమ్ ట్రైనింగ్ కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జరుగుతున్న శిక్షణ యొక్క ఆవశ్యకతను వివరించారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను ఉపాధ్యాయులు పెంపొందించేలా తీర్చిదిద్దాలని సూచించారు. తద్వారా ఉత్తమ ఫలితాలు సాధించడంతో గుర్తింపు తేవాలన్నారు. ఈ నెల 27 వరకు జరిగే ఈ శిక్షణను ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిక్షణలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బంగారమ్మ కాలనీలో తాగునీటి కష్టాలు

సాలూరు: మున్సిపాలిటీలో బంగారమ్మ కాలనీలో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. కాలనీలో గల పైలెట్ వాటర్‌స్కీం గత నెల రోజులుగా మరమ్మతులకు గురైంది. దీనితో ట్యాంకు నుంచి నీరు రాక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ సిబ్బందికి తెలిపినా స్పందించడం లేదని వాపోయారు. ఇకనైనా అధికారులు స్పందించి, పైలెట్ వాటర్‌స్కీం మరమ్మతులు చేయించి తాగునీటి కష్టాలు తీర్చాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

సాగు గుర్తింపు కార్డుల జారీ

- గ్రామ సభల్లో అర్హులను గుర్తించి కార్డుల మంజూరు
- భూ యజమానుల హక్కులకు భంగం వాటిల్లకుండా కార్డుల జారీ



కొమరాడలో ఉభాలు చేస్తున్న రైతులు

పార్వతీపురం: కౌలు రైతులకు సాగు గుర్తింపు కార్డుల జారీ ప్రక్రియ ప్రారంభమైంది. సాగుదారులను గుర్తించేందుకు మండలాల్లో సాగు గుర్తింపు కార్డుల జారీ చేసేందుకు రెవెన్యూ, వ్యవసాయ శాఖ సిబ్బంది గ్రామ సభలను నిర్వహించి దిశా నిర్దేశం చేస్తున్నారు. గత ఏడాది ఖరీఫ్‌కు ముందుగానే అంటే ఏప్రిల్‌లోనే గుర్తింపు కార్డులను జారీ చేశారు. ఆగస్టు వరకు కొనసాగించి పంట సాగుదారులను గుర్తించి అర్హులకు సాగుదారుల కార్డులను మంజూరు చేశారు.

కార్డుల జారీ ప్రక్రియ కాస్త ఆలస్యం

ఈ ఏడాది సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కార్డుల ప్రక్రియ కాస్త జాప్యం ఏర్పడింది. గత ఏడాది జారీ చేసిన అన్ని కార్డుల కాల పరిమితి దాదాపు కావడంతో అర్హులకు సాగుదారుల కార్డులను జారీ చేయనున్నారు. కౌలుదారులను అన్ని రకాలుగా ఆదుకొనేందుకు గత ప్రభుత్వం చట్టాని తీసుకొచ్చింది. ముఖ్యంగా ఎరువులు, విత్తనాలు సరఫరాతో పాటు పండిన వ్యవసాయ ఉత్పత్తులను విక్రయించుకొనేందుకు ఈ కార్డులు ఎంతో ఉపయోగపడతాయి. అలాగే ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు పరిహారం మంజూరు చేసేందుకు దోహదం చేస్తుంది.

కౌలు రైతులకు మద్దతుగా నిలిచేలా..

కౌలు రైతులకు మద్దతుగా నిలిచేలా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ పంట సాగుదారుల చట్టం • 2019 ప్రకారం భూ యజమాని హక్కులకు ఎలాంటి నష్టం లేకుండా సాగు చేసే కౌలు రైతులకు పంట సాగుదారు కార్డు ఇవ్వాలని నిర్ణయించింది. సాగుదారు కార్డులిచ్చి వారికి ఆర్థిక చేయూత అందించడానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పంట సాగుదారుల హక్కుల చట్టం అమలులోకి తెచ్చింది. భూ యజమానులకు, వారి భూమిపై ఉన్న హక్కులకు ఎటువంటి భంగం కలగకుండా రక్షిత కౌలు దారీ చట్టం – 1956ను రద్దు చేసింది. కొత్త చట్టంలో మరికొన్ని జాగ్రత్తలు తీసుకొని కౌలుదారులను ఆదుకొంది.

నిశ్చితంగా ఉండేందుకే...

ఈ చట్టం విషయంలో భూ యజమానులు నిశ్చితంగా ఉండవచ్చని అప్పటి ప్రభుత్వం తెలిపింది. ఈ చట్టం అమల్లో భూ యజమానులు, కౌలు రైతులు ఒకరికి ఒకరు సహకరించుకోవాలని వ్యవసాయ శాఖాధికారులు గతంలో సూచనలు జారీ చేశారు. భూ యజమానుల హక్కులకు ఎలాంటి భంగం కలగకుండా వారి హక్కుల రక్షణకు అన్ని రకాల ఏర్పాట్లు చేస్తూ సాగు చేసే రైతులకు పంట రుణం పొందడానికి వీలుగా సాగుదారుల కార్డు మంజూరు చేసేందుకు కొత్త చట్టం తీసుకువచ్చింది.

కార్డులు పొందడం ఎలా...

సాగుదారు కార్డు భూ యజమానికి సాగు చేస్తున్న రైతుకు మధ్య ఒప్పందాన్ని సూచిస్తోంది. కార్డుపైన భూ యజమాని (లేదా వారి ప్రతినిధి), సాగుదారు, గ్రామ పరిపాలనాధికారి (వీఆర్‌ఓ, ఆథరైజ్డ్ ఆఫీసర్) ఈ ముగ్గురు సంతకాలుండాలి. పంట సాగుదారు కార్డు కాలపరిమితి 11 నెలలు మాత్రమే. 11 నెలల తరువాత సాగుదారు మళ్లీ కొత్తగా కార్డు పొందాల్సి ఉంటుంది. రైతు సేవా కేంద్రాన్ని సంప్రదించడం, తద్వారా వ్యవసాయ సహాయకులతో కలిసి కార్డుకు దరఖాస్తు చేయాలి.

జిల్లాలో 3,906 కార్డులు మంజూరు

జిల్లా వ్యాప్తంగా 966 గ్రామాల్లో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఇంతవరకు 3,906 మందికి సాగుదారు కార్డులను జారీ చేశారు. ఈ ఏడాది జూలై ప్రారంభం నుంచి నిర్వహిస్తున్న గ్రామసభలలో అర్హులకు సాగుదారు కార్డులను మంజూరు చేస్తున్నారు. ప్రస్తుతం గ్రామాలలో సాగు చేస్తున్న రైతులతో గ్రామసభలను నిర్వహించి మరింత మంది కౌలు రైతులకు సాగుదారు కార్డులను మంజూరు చేయనున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం..



గత ఏడాది మే నుంచి సాగుకార్డులు జారీ చేశాం. ప్రస్తుతం ఎన్నికల కోడ్ ఎత్తివేయడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కౌలు గుర్తింపు కార్డుల జారీ ప్రక్రియ ప్రారంభించాం. రైతుసేవా కేంద్రాల్లో సిబ్బందికి సూచనలు జారీ చేశాం. కాలపరిమితి తీరిన కార్డుల స్థానంలో కొత్తవి మంజూరు చేయాలని, కొత్తగా ఎవరైనా సాగుదారు కార్డుల కోసం దరఖాస్తు చేసుకుంటే, పరిశీలించి సాగుదారు కార్డులను జారీ చేయాలని ఆదేశాలు జారీ చేశాం.

– కె.రాబర్ట్‌పాల్, జిల్లా వ్యవసాయాధికారి, పార్వతీపురం మన్యం



కౌలు రైతులను గుర్తించేందుకు గరుగుబిల్లిలో నిర్వహించిన గ్రామసభ

జిల్లాలో మండలాల వారీగా కార్డుల మంజూరు ఇలా..

మండలం	సాగుదారుల కార్డుల మంజూరు
పాలకొండ	185
సాలూరు	167
వీరఘట్టం	236
పాచిపెంట	110
కురుపాం	195
జియ్యమ్మవలస	303
గరుగుబిల్లి	316
మక్కువ	235
గుమ్మలక్ష్మీపురం	236
భామిని	297
కొమరాడ	311
పార్వతీపురం	388
బలిజిపేట	372
సీతానగరం	390
సీతంపేట	165

సమష్టిగా సమన్వయంతో పని చేద్దాం..

- మంత్రి సంధ్యారాణి
- గ్రామాల అభివృద్ధికి మరిన్ని నిధులిస్తా..: జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

పాచిపెంట: సమష్టిగా సమన్వయంతో పని చేసి మండలాభివృద్ధికి కృషి చేద్దామని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. ఎంపీపీ బడ్నాన ప్రమీల అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం జరిగింది. సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి సంధ్యారాణి మాట్లాడుతూ స్థానిక సంస్థల బలోపేతానికి కృషి చేస్తానన్నారు. సర్పంచ్‌లకు నిధుల కొరత రాకుండా చూస్తానని అన్నారు. ఆ నిధులతో గ్రామాలను అభివృద్ధి చేయాలని సూచించారు. మరో ముఖ్య అతిథిగా పాల్గొన్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ఇప్పటికే జెడ్పీ నిధులు గతంలో ఇచ్చామని గుర్తు చేశారు. గ్రామాలు మరింత అభివృద్ధికి మరిన్ని జెడ్పీ నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. మండల కేంద్రంలో పీహెచ్‌సీని పది పడకల ఆస్పత్రి నుంచి 30 పడకల ఆస్పత్రిగా మార్చేందుకు సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. కొటికిపెంట పంచాయతీ గరేల్లవలసలో చెరువులో తీసిన బోరు వల్ల కలుషిత నీరు వస్తుందని, ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తగు చర్యలు తీసుకోవాలని సర్పంచ్ ఇజ్జాడ అప్పలనాయుడు కోరారు. పాచిపెంట 3 ఎంపీటీసీ దండి ఏడుకొండలు మాట్లాడుతూ స్థానిక గ్రంథాలయం ఎదురుగా ఉన్న మద్యం దుకాణాన్ని వేరే చోటకు తరలించాలని కోరారు. ఎంపీపీ బడ్నాన ప్రమీల మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాటి ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర మండలంలో రూ.వందల కోట్లతో అభివృద్ధి పనులు మంజూరు చేశారన్నారు. వీటిలో కొన్ని పనులు పూర్తి కాగా, పలు పనులు వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. వీటిని ప్రస్తుత ప్రభుత్వం పూర్తి చేయాలని మంత్రి సంధ్యారాణిని ఎంపీపీ కోరారు. సమావేశంలో జెడ్పీ వైస్ చైర్మన్ కొత్రజన్ని సింహాచలం, ఎంపీపీ డి.లక్ష్మీకాంత్, మండల ప్రత్యేకాధికారి డీఎస్‌ఓ శివప్రసాద్, పలు శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పాలక మోహన్



మురళి

పార్వతీపురం టౌన్: పికప్ వాహనం బైక్‌ను ఢీకొని ఇద్దరికి గాయాలైన సంఘటన గుమ్మలక్ష్మీపురం మండలం దయాపురం గ్రామ సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. జిల్లా ఔట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పాలక మోహన్ తన మేనల్లుడు మురళితో కలసి సొంత పనుల నిమిత్తం ముకుందాపురం వెళ్లారు. పని ముగించుకుని తిరిగి వెళ్తున్న సమయంలో మార్గమధ్యంలో ఎదురుగా వచ్చిన పికప్ వాహనం ఢీకొంది. గమనించిన స్థానికులు పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

గుణాత్మక విద్య అందించాలి

పాలకొండ రూరల్: తరగతి గదిలో విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించాలని రాష్ట్ర విద్యాశాఖ అబ్జర్వర్ నేహా అన్నారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న టీచ్ టూల్ శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఉపాధ్యాయులు తమలో ఉన్న బోధనా స్థాయిని మరింతగా పెంచుకునేందుకు ఈ తరహా శిక్షణలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో ఉప విద్యాశాఖాధికారి పి.కృష్ణమూర్తి, ఎంఈఓ కె.సోంబాబుతో పాటు నాలుగు మండలాలకు చెందిన పలువురు ఉపాధ్యాయులు హాజరయ్యారు.



శిక్షణ కార్యక్రమంలో సూచనలు చేస్తున్న రాష్ట్ర విద్యాశాఖ అబ్జర్వర్ నేహా

క్రీడలతో మానసిక ఉల్లాసం



వాలీబాల్ కిట్‌ను గిరిజన యువకులకు అందజేస్తున్న ఎస్‌ఐ

మక్కువ: క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దారుఢ్యం పెంపొందుతుందని ఎస్‌ఐ పి.నరసింహమూర్తి అన్నారు. మండలంలోని పనసభద్ర, బొడ్డు సామంతవలస, ఆలగురువు, గుంటభద్ర, మూలవలస గ్రామాలకు చెందిన గిరిజన యువకులకు ఎస్పీ ఆదేశాల మేరకు ఎస్‌ఐ వాలీబాల్ కిట్లను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమంలో భాగంగా, గిరిజన యువకులు క్రీడలపై పట్టు సాధించేందుకు అవసరమైన వాలీబాల్ కిట్లను పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. గిరిజనులతో మమేకం అయ్యేందుకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు, క్రీడల పోటీలు నిర్వహించడంతో పాటు, గిరిజనులకు అన్నివేళలా సహాయపడేందుకు పోలీస్ శాఖ ముందుంటుంది అన్నారు. యువకులు చెడు తోవలో పయనించకుండా సన్మార్గంలో నడుచుకోవాలని కోరారు. గ్రామీణ ప్రాంతాలలో ప్రజలంతా స్నేహభావంతో జీవించాలన్నారు. గ్రామాలలో ఏవైనా సమస్యలు ఉంటే మా దృష్టికి తీసుకొస్తే ఉన్నత అధికారులు దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వే అండర్ పాసేజ్ సబ్ వేపై నిలిచిన నీరు



అప్పయ్యపేట వద్ద రైల్వే శాఖ నిర్మించిన అండర్ పాసేజ్ వద్ద నిలిచిన నీరు

సీతానగరం: మండలంలోని అప్పయ్యపేట వద్ద రైల్వే శాఖ నిర్మించిన అండర్ పాసేజ్‌లో నీరు నిల్వ ఉండి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా రైతులు ఈ మార్గంలో తమ ఎడ్ల బళ్లతో ఎరువులు తరలించేందుకు అవస్థలు పడుతున్నారు. విశాఖ – రాయగడ రైల్వే లైన్‌కు ఇరు వైపులా అప్పయ్యపేట గ్రామానికి చెందిన రైతుల జిరాయితీ భూములున్నాయి. ఆయా భూముల్లో వందల మంది రైతులు వ్యవసాయ పనుల కోసం నిత్యం రాకపోకలు చేయాల్సి ఉండగా ఈ మార్గంలో అండర్ పాసేజ్‌లో నీరు నిలిచి పోవడంతో ఏటా ఇబ్బందులు పడుతున్నారు. వాహనదారులకు సైతం అవస్థలు తప్పడం లేదు. వ్యవసాయ సీజన్‌లో ఈ పాసేజ్‌కు ఇరువైపులా ఉన్న పంట పొలాల్లో సాగుకు రైతులు నానా అగచాట్లు పడుతున్నారు. రైల్వే అధికారులు స్పందించి ఏటా నెలకొంటున్న ఈ సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.

శివారు భూములకు సాగునీరు అందిస్తాం

- ఎమ్మెల్యే విజయచంద్ర



పెదంకలాం కాలువ నీరు విడుదల చేసిన ఎమ్మెల్యే విజయచంద్ర

బలిజిపేట: పెదంకలాం కాలువ ఆయకట్టు శివారు భూములకు ఈ ఖరీఫ్ సీజనులో సాగునీరు అందిస్తామని ఎమ్మెల్యే విజయచంద్ర తెలిపారు. పెదంకలాం కాలువ నీటిని ఆయన శుక్రవారం విడుదల చేశారు. కాలువ ఆయకట్టుకు పూర్తి స్థాయిలో నీరు అందే విధంగా చర్యలు చేపడతామన్నారు. ఖరీఫ్‌లో రైతులకు అవసరమైన సాగునీటిని అందివ్వడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. రైతులు ఎవరు ఆందోళన చెందవద్దన్నారు. ఎరువులు, సాగునీరు సకాలంలో అందించి పంట పండించేందుకు సహకరిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వేణునాయుడు, అరకు పార్లమెంటు కార్యదర్శి ఎం.అప్పారావు, బీసీ సెల్ అధ్యక్షుడు రామ్మోహనరావు, ఎం.పాపినాయుడు, వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి



లచ్చయ్యపేట వద్ద రాష్ట్ర రహదారిపై ర్యాలీ చేస్తున్న అధికారులు, ప్రజలు

సీతానగరం: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంపీడీఓ ఎం.ఈశ్వరరావు, తహసీల్దార్ శ్రీనివాసరావు, పీహెచ్‌సీ డాక్టర్ నిహారిక అన్నారు. మండలంలో జరుగుతున్న పారిశుద్ధ్య పక్షోత్సవ కార్యక్రమాల్లో భాగంగా లచ్చయ్యపేటలో సర్పంచ్ సీహెచ్ కృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. మండల స్థాయి అధికారులు పారిశుద్ధ్య పనులు నిర్వహించడానికి ప్రజలంతా సహకరించాలని కోరారు. ఇంటింటా సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, ఎంపీటీసీ సింహాచలం, ఎంఈఓలు జి.సూరిదేముడు, ఎంవీ రమణ, ఈఓపీఆర్‌ఆర్డీ కె.కుమారవర్మ, ఏపీఎం ఆర్.శ్రీరాములు, ఏపీఓ భాను, పంచాయతీ కార్యదర్శి మురళీ, హెల్త్ సూపరువైజరు శర్మ, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అంగన్‌వాడీ సిబ్బంది, గ్రామ పంచాయితీ పాలకవర్గ సభ్యులు, వైద్య సిబ్బంది, వివిధ శాఖల అధికార సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాలో పలు వాహనాలపై కేసులు



పట్టణ శివారులో తనిఖీలు నిర్వహిస్తున్న రవాణా శాఖాధికారులు

పార్వతీపురం టౌన్: జిల్లాలో ఆరు వాహనాలపై కేసులు నమోదు చేసామని జిల్లా రవాణా శాఖాధికారి శశికుమార్ అన్నారు. శుక్రవారం ఆర్టీసీ, జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో సంయుక్త తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టామన్నారు. అందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రమాదాలకు కారణం ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను తీసుకువెళ్లడం కారణమని గుర్తించామన్నారు. జిల్లాలో నిర్వహించిన తనిఖీల్లో 6 ఆటోలపై కేసులు నమోదు చేసి రూ.22వేలు అపరాధ రుసుం వసూలు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంవీఐ ఎస్.రమేష్‌కుమార్, ఆర్టీసీలు ఏడీసీ నాయుడు, కేస్ పట్నాయక్ రవాణా శాఖ – ఏపీఎస్‌ఆర్టీసీ డిపో సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన బోధన అందించాలి

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: విద్యార్థులకు మెరుగైన బోధన అందిచేందుకు ప్రత్యేకాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో 'మై స్కూల్-మై ప్రైడ్' కార్యక్రమంపై వీడియో కాన్ఫరెన్స్ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేక అధికారులు వారంలో కనీసం రెండుసార్లు పాఠశాలలను సందర్శించాలని అన్నారు. విద్యార్థులకు సరైన మార్గ నిర్దేశనం, ఉన్నత చదువులు, ఉద్యోగాలు, వివిధ రంగాల్లో అవకాశాలు తెలియజేయాలని సూచించారు. విద్యార్థులకు ప్రేరణ కల్పించి విద్యపట్ల ఆసక్తి కలిగించడమే కాకుండా వెనుకబడిన అంశంలో ప్రత్యేక తర్ఫీదునిచ్చి తీర్చిదిద్దాలన్నారు. 10వ తరగతి విద్యార్థుల పట్ల శ్రద్ధ వహించడమే కాకుండా 8, 9 తరగతుల విద్యార్థులకు కూడా మంచి సూచనలు, సలహాలు ఇవ్వాలని ఆయన చెప్పారు. గత రెండు సంవత్సరాల కాలంలో పదవ తరగతిలో జిల్లా మొదటి స్థానంలో నిలిచిందని, అదే స్థానం కొనసాగుటకు కృషి చేయాలని ఆయన ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అధికారులు, మండల అధికారులు పాల్గొన్నారు.

'అప్రమత్తంగా ఉండాలి'

గరుగుబిల్లి: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా కురుస్తున్న వర్షాల పట్ల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని వీఆర్‌ఓలకు తహసీల్దార్ కె.విజయ ఆదేశించారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ అధిక వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని, రాకపోకలకు ఇబ్బందులు రాకుండా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. నదులు, వాగులు, వంకలు, చెరువులను ఎవరూ దాటకుండా, దిగకుండా సూచనలు చేయాలన్నారు. వరదల సమయంలో ప్రజలు పాము, తేలు కాట్లుకు గురయ్యే ప్రమాదం ఉందని, వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని వైద్యశాఖ అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో నీట మునిగే గ్రామాలు, బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయే పరిస్థితులు గమనించాలన్నారు.